సాక్షి పెద్దపల్లి

సోమవారం । 1 । సెప్టెంబర్ । 2025



మొక్కలు నాటిన డీజీఎంఎస్

గోదావరిఖని: సింగరేణి బంగ్లాస్ ఏరియాలో డీజీఎంఎస్ ఉజ్వల్‌తాహ ఆదివారం మొక్క నాటారు. శ్రీరాంపూర్ ఏరియాలో జరిగే సేఫ్టీ కార్యక్రమానికి వెళ్తూ మొక్క నాటి నీళ్లు పోశారు.



బీసీ రిజర్వేషన్లపై సంబురాలు

గోదావరిఖని: బీసీలకు 42శాతం రిజర్వేషన్ సౌకర్యం అమలు చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించడంపై కాంగ్రెస్ నాయకులు ఆదివారం సంబురాలు చేసుకున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ శాతం పెరుగుతుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గోశాలలో సివిల్ జడ్జి



జడ్జి గణేశ్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): స్థానిక యాదవనగర్ పెరికె గిద్దెహనుమాండ్ల ఆలయంలో సివిల్ జడ్జి గణేశ్ ఆదివారం పూజలు చేశారు. జడ్జి దంపతులు తొలుత గోవులకు దాణా అందజేశారు. అనంతరం జడ్జి దంపతులను గోశాల వ్యవస్థాపక అధ్యక్షుడు బండారి సూర్యం, న్యాయవాదులు లెక్కల గంగాధర్, కరుణాకర్, నాయకులు పన్నాల సతీశ్ ఘనంగా సన్మానించారు.

ఘనంగా గణపతి నిమజ్జనం



గణపతి సన్నిధిలో సీపీ, పోలీస్ అధికారులు

గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ఆదివారం గణేశ్ నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ప్రత్యేకపూజలు చేసి గణనాథునికి వీడ్కోలు పలికారు. ఆర్ఐ శ్రీనివాస్, సీసీ హరీశ్, ఆర్ఎస్ఐ పోచలింగం, స్పెషల్ పార్టీ, ఏఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపటిలోగా దరఖాస్తు చేయండి

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని 'టాస్క్' శిక్షణ కేంద్రంలో సాంకేతిక కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు దక్కేలా చూస్తున్నామని రీజినల్ సెంటర్ ఇన్‌చార్జి కౌసల్య తెలిపారు. జావా వెబ్ డెవలప్‌మెంట్ పైథాన్, సీసీ, హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, జావాస్క్రిప్ట్, టాలివిత్ జీఎస్టీ, అప్టిట్యూడ్ రీజనింగ్ సాఫ్ట్ స్కిల్స్‌పై కోచింగ్ ఇస్తామన్నారు. ఆసక్తి గలవారు డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఈనెల 2లోగా తమ పేర్లను టాస్క్ సెంటర్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 90595 06807 నంబరులో సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి పఠనోత్సవం

సుల్తానాబాద్(పెద్దపల్లి): విద్యార్థులు చదవడాన్ని అలవాటుగా చేసుకోవడం లక్ష్యంగా పాఠశాల విద్యా శాఖ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 1 నుంచి 15వ తేదీ వరకు పఠనోత్సవం(రీడింగ్ క్యాంపెయిన్) నిర్వహించాలని ఆదేశించింది. ఇందులో భాగంగా 30 నిమిషాల పాటు విద్యార్థులను పాఠాలు చదివిస్తారు. పాఠ్యపుస్తకాలు, కథల పుస్తకాలు, దినపత్రికలు, వార, మాసపత్రికలు వంటివి ఇందులో ఉన్నాయి. అంతేకాదు.. కథలు సృష్టించడంపైనా వర్క్‌షాప్‌లు నిర్వహించాలని ప్రభుత్వం సూచించిందని ఎంఈవో రాజయ్య తెలిపారు.

నేడు 'పింఛన్ విద్రోహ దినం'

పెద్దపల్లిరూరల్: ఉద్యోగ, ఉపాధ్యాయ, గెజిటెడ్, కార్మికుల పింఛన్ సమస్యపై చర్చించేందుకు సోమవారం హైదరాబాద్‌లో సోమవారం జరిగే ఆత్మగౌరవ సభకు తరలిరావాలని టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్, జేఏసీ చైర్మన్ తూము రవీందర్ కోరారు. జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన సమావేశంలో సభ ప్రచార పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. సెప్టెంబర్ ఒక టో తేదీన పింఛన్ విద్రోహదినంగా పాటించాలని వారు కోరారు.

రూ.4కోట్లతో ప్రహరీ నిర్మాణం



ప్రహరీ నిర్మాణానికి ఏర్పాటు చేసిన గుర్తులు

రామగుండం: స్థానిక 62.5 మెగావాట్ల బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం భూముల పరిరక్షణకు విద్యుత్ సౌధ ప్రత్యేక దృష్టి సారించింది. అతి విలువైన స్థలాలు కబ్జాకు గురికాగా, మరికొన్ని ఆక్రమణల పాలయ్యే అవకాశం ఉంది. దీంతో రూ.4 కోట్ల వ్యయంతో చుట్టూ ప్రహరీ నిర్మాణానికి పూనుకుంది. ఇందుకోసం లేజర్ లెవల్, స్పిరిట్ లెవల్ యంత్రాలతో కచ్చితత్వంతో హద్దులు ఏర్పాటు చేసింది. విద్యుత్‌నగర్, సీకాలనీ వద్ద పనులు ప్రారంభమయ్యాయి.

భారీకాయం.. తీరొక్క రూపం



ఆకట్టుకుంటున్న 61 అడుగుల మట్టిగణపతి



కొంతంవాడలో ఎకో గణనాథుడు



తెనుగువాడలో గద్దె వినాయకుడు



శివుని రూపంలో స్వామివారు

ఆదిదేవుడు గణపయ్య నిత్యపూజలు అందుకుంటున్నాడు. భక్తులు ధూప, దీప నైవేద్యాలతో పూజిస్తూ తమ కుటుంబాలను సల్లంగా చూడాలని వేడుకుంటున్నారు. తీరొక్క రూపంలో కొలువుదీరిన వినాయకుడు.. భక్తులకు దర్శనమిస్తున్నాడు. జిల్లాకేంద్రంలో 61 అడుగుల భారీమట్టి విఘ్నేశ్వరుడు.. ఏడుకొండల వెంకటేశ్వరుని రూపంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. ఉమ్మడి జిల్లాతోపాటు రాష్ట్రంలోని చాలామంది భక్తులు భారీ మట్టిగణనాథుని చూసేందుకు తరలివస్తున్నారు. గోదావరిఖని, సుల్తానాబాద్, మంథని తదితర ప్రాంతాల్లోనూ వివిధ రూపాల్లో స్వామివారు దర్శనమిస్తున్నారు. ఈసందర్భంగా భక్తులు ఆదివారం దీపాలంకరణ చేశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

14వేల కార్డులు.. 165 టన్నుల బియ్యం

- కొత్తరేషన్ కార్డుదారులకు పంపిణీ
- జిల్లాలో పెరిగిన సెప్టెంబర్ నెల కోటా
- నేటినుంచి పంపిణీకి డీలర్ల ఏర్పాట్లు

పెద్దపల్లిరూరల్: కొత్తగా పెళ్లయిన వారు.. కుటుంబం నుంచి విడిపోయి వేరే కాపురం పెట్టిన కొత్త దంపతులు వేలాది మంది మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసి కొత్త రేషన్‌కార్డుల కోసం ఏళ్లకేళ్లుగా నిరీక్షించారు. అయినా, కొత్తకార్డులు అందలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తోంది. స్థానిక ఎమ్మెల్యేలు, అధికారులు కొత్తరేషన్‌కార్డులు అందజేయడంతో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

జిల్లాలో 413 రేషన్‌దుకాణాలు..

జిల్లాలోని 14 మండలాలల్లో రేషన్‌కార్డుదారులకు ప్రతీనెల 413 రేషన్‌దుకాణాల ద్వారా డీలర్లు బియ్యం పంపిణీ చేస్తున్నారు. 2025 జూన్ వరకు 2,23,553 రేషన్‌కార్డులు ఉన్నాయి. ఇందులో 6,66,912 మంది ఈ ఏడాది జూన్‌లో(జూన్, జూలై, ఆగస్టు) మూడు నెలల బియ్యం కోటాను ఒకే సారి తీసుకున్నారు.

పథకాల ప్రచారం కోసం 'చేతిసంచి'

దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రేషన్‌దుకాణాల ద్వారా బియ్యంతోపాటు 9 రకాల నిత్యావసరాలను చేతిసంచిలో ఉంచి కార్డుదారులకు అందించారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి అన్ని సరుకులేవీ అందించకున్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వివరాలతో కూడిన చేతిసంచిని ప్రతీ రేషన్‌కార్డుదారుకు అందించాలని నిర్ణయించింది. చేతిసంచిపై సీఎం, డెప్యూటీ సీఎం, సివిల్ సప్లయి మంత్రి ఫొటో ముద్రించారు.

సరుకులిస్తారా.. సమ్మె చేస్తారా?

తమకు ఐదు నెలల కమీషన్ అందక ఇబ్బందులు పడుతున్నామని గత సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ శ్రీహర్షకు రేషన్ డీలర్లు వినతిపత్రం అందించారు. ప్రభుత్వం కమీషన్ చెల్లింపులో జాప్యం చేస్తే సెప్టెంబర్ కోటా బియ్యం పంపిణీ చేయకుండా సమ్మె చేస్తామని డీలర్ల సంఘం నాయకుడొకరు తెలిపారు. అయితే, కొత్తకార్డుదారులు సంతోషంతో బియ్యం కోసం ఎదురు చూస్తుండగా.. డీలర్లు సరుకులిస్తారో.. సమ్మెకు వెళతారోననే మీమాంస నెలకొంది.



కొత్త రేషన్‌కార్డు అందిస్తున్న పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు(ఫైల్)

కొత్తకార్డులు 14,843

జిల్లాలో కొత్త రేషన్‌కార్డులు 14,843 మంజూరయ్యాయి. వీటిద్వారా 27,559 మంది లబ్ధిదారు లు సెప్టెంబర్ నుంచి బియ్యం తీసుకునేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్కొక్కరికి 6 కేజీ ల చొప్పున మొత్తం 165 మెట్రిక్ టన్నుల బి య్యం అదనంగా పంపిణీ చేయనున్నారు. ఇప్ప టికే సెప్టెంబర్ కోటా సన్న బియ్యం రేషన్ డీలర్లకు చేరవేశారు. జిల్లాలో సెప్టెంబర్‌లో మొత్తం 2,38,438 తెల్లరంగు రేషన్‌కార్డులపై 6,94,471 మంది పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తారు.

జిల్లా సమాచారం

మండలాలు	14
గ్రామపంచాయతీలు	266
రేషన్ దుకాణాలు	413
మొత్తం రేషన్‌కార్డులు	2,38,438
ఇందులో కొత్తగా మంజూరైనవి	14,885
పెరిగిన యూనిట్లు	27,559
పెరిగిన బియ్యం కోటా(మెట్రిక్ టన్నుల్లో)	165

సంతోషంగా ఉంది



రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుని ఏళ్లతరబడి నిరీక్షించాం. కాంగ్రెస్ ప్రభుత్వ రావడంతో మాకు కొత్త రేషన్‌కార్డు మంజూరైంది. ఎమ్మెల్యే, అధికారులు కొత్తకార్డు అందించారు. కొత్తకార్డు రావడం సంతోషాన్నిచ్చింది.

– వాత్సల్య, కొత్త రేషన్‌కార్డుదారు

కోటా పెరిగింది



కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం రేషన్‌కార్డులు మంజూరు చేసింది. దీంతో రేషన్ డీలర్లకు కొంచెం కోటా పెరిగింది. లబ్ధిదారులకు ప్రతీనెల సరుకులు పంపిణీ చేస్తున్న మాకు సకాలంలో కమీషన్ చెల్లించడం లేదు. వీలైనంత త్వరగా కమీషన్ చెల్లించాలి. గౌరవవేతనం ఇవ్వాలి.

– ఎలబోతారం శంకర్, రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు

డీలర్లకు చేరవేశాం



జిల్లాలో కొత్తగా 14,885 రేషన్ కార్డుల ద్వారా 27,559 యూనిట్లకు సరిపడా సన్నబియ్యం కోటా సెప్టెంబర్ నుంచి పంపిణీ చేస్తాం. రేషన్‌కార్డులందరికీ (కొత్తవారితో కలిపి) పంపిణీ చేసేందుకు అవసరమైన కోటాను రేషన్ దుకాణాలను చేరవేశాం. సెప్టెంబర్ నెలనుంచి కొత్తకార్డుదారులు సన్నబియ్యం పొందుతారు.

– శ్రీనాథ్‌రెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్

పేదల సంతోషమే ముఖ్యం

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తోంది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్కరేషన్‌కార్డు కూడా ఇయ్యలే. కానీ సీఎం రేవంత్‌రెడ్డి అర్హులందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేశారు. కార్డులు తీసుకునే కొత్త లబ్ధిదారుల ముఖాల్లో పట్టరాని సంతోషం కనిపించింది. రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ.

– చింతకుంట విజయరమణారావు, ఎమ్మెల్యే, పెద్దపల్లి

ఆవిష్కరణలకు అడుగులు

- రోబోల రూపకల్పనకు శిక్షణ
- జిల్లాలోని 9 మోడల్ స్కూళ్ల ఎంపిక
- 1,193 మంది విద్యార్థులకు తర్ఫీదు



ఉపకరణాలతో సాధన చేస్తున్న విద్యార్థులు

రామగుండం: అటల్ టింకరింగ్ ల్యాబ్(ఏటీఎల్), అటల్ ఇన్నోవేషన్ మిషన్ (ఏఐఎం) ద్వారా విద్యార్థుల్లోని సృజనకు పదును పెట్టడం.. ఆలోచనా శక్తి పెంపొందించడం.. డిజైన్ మైండ్‌సెట్ వృద్ధి చేయడం.. కంప్యూటేషన్ థింకింగ్ వంటి నైపుణ్యాలు మెరుగుపర్చడం లక్ష్యంగా సర్కార్ స్కూళ్లలోని చురుకైన విద్యార్థులకు రోబోటిక్స్ తయారీపై శిక్షణ ఇచ్చేందుకు కేంద్రప్రభుత్వం సిద్ధమైంది. ఈమేరకు జిల్లాలోని తొమ్మిది మోడల్ స్కూళ్లను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికచేసింది. అందులో ఎనిమిది, తొమ్మిదో తరగతి చదువుతున్న 1,193 మంది విద్యార్థులను గుర్తించింది. నెలలో ఒకరోజు చొప్పున వీరికి ఏడు నెలల పాటు శిక్షణ ఇవ్వనుంది. ఒకరోజు బోధన, మిగతా రోజుల్లో సాధన చేసేలా కార్యాచరణ రూపొంచింది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో వైజ్ఞానిక దినోత్సవం సందర్భంగా ఆవిష్కరణలను ప్రదర్శించేలా ప్రణాళికతో ముందుకు సాగుతోంది.

శిక్షణ ఇచ్చే అంశాలు..

- **రోబోల నిర్మాణం:** డిజైన్ కోసం విడిభాగాలు, గేర్‌లు, మోటార్లు వంటివి ఉపయోగించడం
- **ప్రోగ్రామింగ్:** ఆర్డ్‌నో, రాస్ప్ బెర్రీ, స్క్రాచ్, పైథాన్ వంటి ప్లాట్‌ఫామ్స్‌పై రోబోట్‌లను నియంత్రించడానికి కోడింగ్ నేర్పించడం..
- **సెన్సార్లు/ఎలక్ట్రానిక్స్:** అల్ట్రాసోనిక్, ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్లు, ఎల్ఈడీలు, సర్క్యూట్ డిజైన్ వంటి ఎలక్ట్రానిక్ విడిభాగాలపై శిక్షణ
- **ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్:** రోబోట్‌లను ఇంటర్నెట్‌తో అనుసంధానించి డేటా సేకరించడం, నియంత్రణ చేయడం
- **త్రీడీ ప్రింటింగ్:** రోబో విడి భాగాలు డిజైన్ చేయడం, తయారు చేయడం.
- **ప్రాజెక్టు, బేస్డ్ లెర్నింగ్:** సొంతంగా చిన్న రోబోలు, ఆటోమేటెడ్ సిస్టమ్స్ సమస్యలు పరిష్కరించే ప్రాజెక్టుల తయారీ
- **ఏఐ ఇంటిగ్రేషన్:** ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో రోబోటిక్స్‌ను కలిపి శిక్షణ ఇవ్వడం
- **సాఫ్ట్ స్కిల్స్:** టీమ్ వర్క్, సమస్యల పరిష్కార నైపుణ్యాలు, డిజైన్ థింకింగ్, ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించడం.

ఐఐటీలో సీటు సాధిస్త



మాకు నేర్పిస్తున్న రోబోటిక్ సబ్జెక్టు బీటెక్‌లో ఏఐఎంఎల్ విద్యార్థులకు అందుబాటులో ఉందట. అంతటి అడ్వాన్స్‌డ్ రోబోటిక్‌పై మాకు అవగాహన పెంచుతున్నరు. ఇంటర్ తర్వాత ఐఐటీలో సీటు సాధించడమే లక్ష్యంగా నేర్చుకుంటున్న.

– హర్షిత్‌రెడ్డి, తొమ్మిదో తరగతి

తీర్చిదిద్దుతున్నాం



శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం. కార్పొరేట్ సంస్థకు దీటుగా రోబోటిక్ తయారీపై శిక్షణ ఇవ్వడం శుభసూచకం. ప్రతిభ కలిగిన విద్యార్థులను ఎంపిక చేసి సుశిక్షితులుగా తయారు చేస్తాం.

– సదానందం యాదవ్, ప్రిన్సిపాల్, మోడల్ స్కూల్

సాదాబైనామాలకు మోక్షం

- దరఖాస్తుల పరిష్కారానికి జిల్లా అధికారుల చర్యలు
- హైకోర్టు తీర్పుతో అన్నదాతల్లో ఆనందం



సుల్తానాబాద్(పెద్దపల్లి): సాదాబైనామాలకు ఎట్టకేలకు మోక్షం లభించనుంది. గతంలో కేవలం తెల్లకాగితాలపై రాసుకుని రైతులు భూముల క్రయవిక్రయాలు సాగించారు. ఇలాంటి వాటిని క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం భావించింది. గత ప్రభుత్వం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. తదుపరి కార్యాచరణలో పురోగతిలేక దరఖాస్తుదారులు అనేక ఏళ్లు నిరీక్షించారు. చివరకు హైకోర్టు ఇటీవల తీర్పు వెలువరించడంతో సాదాబైనామాల క్రమబద్ధీకరణకు మోక్షం లభిస్తుందని అంటున్నారు.

జిల్లాలో 5,854 దరఖాస్తులు..

జిల్లావ్యాప్తంగా అధికారులకు 5,854 సాదాబైనామా దరఖాస్తులు అందాయి. జూలపల్లి మండలంలో అత్యధికంగా 1,138 దరఖాస్తులు రాగా, కమాన్‌పూర్ మండలంలో అతితక్కువగా 99 దరఖాస్తులు వచ్చాయి.

సాగు చేస్తున్నా.. హక్కుల్లేవు..

భూమి సాగుచేస్తున్న రైతులకు ఇప్పటిదాకా హక్కులు లేవు. పెట్టుబడి సాయం కోసం అనర్హులే అయ్యారు. హైకోర్టు ఆదేశాలతో అర్హులందరికీ భూములపై హక్కులు దక్కే అవకాశం ఉంది.

మిస్సింగ్ నంబర్లకూ దరఖాస్తులు

గ్రామాలు, పట్టణ శివారుల్లోని మిస్సింగ్ నంబర్లపైనా కొందరు దరఖాస్తు చేశారు. వాటితోపాటు విరాసత్, గిఫ్ట్‌డీడ్ అర్జీలూ ఉన్నాయి. పొరపాట్లు సరిచేయాలని, బంజరాయి, అసైన్డ్, నాలా తదితర సమస్యలపైనా అధికారులకు దరఖాస్తులు అందాయి. ఇలా ప్రభుత్వానికి 15,916 దరఖాస్తులు అందగా.. అందులో 5,854 సాదాబైనామాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

పట్టా వస్తుంది



హైకోర్టు తీర్పుతో సాదాబైనామా ద్వారా మా తల్లిదండ్రులు కొనుగోలు చేసిన భూమిపై హక్కులు వస్తాయి. మా కుటుంబానికి పట్టా వస్తుందని నేను భావిస్తున్నా. హైకోర్టు తీర్పుతో నాలాంటి రైతులకు పట్టా హక్కులు అందుతాయి.

– తిరుపతి, రేగడిమద్దికుంట, దరఖాస్తుదారు

మార్గదర్శకాలు రాగానే అమలు చేస్తాం



సాదాబైనామాలపై కొనుగోలు చేసిన భూముల క్రమబద్ధీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి మాకు మార్గదర్శకాలు రాగానే అమలు చేస్తాం. ఇప్పటికే గ్రామాల వారీగా అందిన దరఖాస్తులపై స్థానిక రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన నిబంధనలు రాగానే అర్హులను గుర్తించి పట్టాలు పంపిణీ చేస్తాం.

– వేణు, అదనపు కలెక్టర్

'స్థానిక' పోరులో సత్తా చూపుదాం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి



మాట్లాడుతున్న సంజీవరెడ్డి

పెద్దపల్లిరూరల్: స్థానిక ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం ప్రతీ నాయకుడు, కార్యకర్త కష్టపడి పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి కోరారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రధాని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలకు అందుతున్న తీరును వివరిస్తూనే, బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమనే నమ్మకాన్ని ప్రజలకు కలిగించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుకు సాధ్యంకాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నన్ని రోజులు కుటుంబదోపిడీ సాగించిందని విమర్శించారు. నాయకులు ఠాకూర్ రాంసింగ్, అశోక్‌రావు, పర్శ సమ్మయ్య, పల్లె సదానందం, కందుల శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, దిలీప్ పాల్గొన్నారు.

'డిక్లరేషన్ పేరిట మోసం'



పత్తి పంటను పరిశీలిస్తున్న మధూకర్

మంథనిరూరల్: రైతు డిక్లరేషన్ పేరిట ప్రభుత్వం రైతులను మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. పోతారం, విలోచవరం గ్రామాల్లో గోదావరి వరద తాకిడితో ముంపునకు గురైన పంటలను ఆదివారం పరిశీలించారు. మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా ఉన్న మంథని ఎమ్మెల్యే.. సర్వే చేయించి రైతులకు ఎకరాకు రూ.25వేల చొప్పున పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు.

శాంతించిన గోదావరి



మంథనిరూరల్: ఎగువన కురిసిన భారీ వర్షాలతోపాటు శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నీటిని గోదావరి నదిలోకి విడుదల చేయడంతో నాలుగు రోజులపాటు వరద తాకిడికి గురైన పార్వతీ బ్యారేజీ వద్ద ఆదివారం ఉధృతి కాస్త తగ్గుముఖం పట్టింది. శనివారం ఉదయం నుంచి తగ్గుతూ వచ్చిన వరద ఉధృతి ఆదివారం కనిష్టస్థాయికి చేరింది. ప్రస్తుతం పార్వతీబ్యారేజీకి 2.03 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. 74గేట్లు ఎత్తి అదేస్థాయిలో దిగువకు వదులుతున్నారు.

వరద తగ్గింది.. బురద మిగిలింది



జ్యోతినగర్(రామగుండం): గోదావరి బ్యాక్ వాటర్ తగ్గుముఖం పట్టింది. కానీ, రోడ్డంతా బురదమయంగా మారింది. ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. మల్కాపూర్ శివారు నుంచి గోదావరి నది వైపు వెళ్లే రోడ్డుపై వరద వచ్చి చేరడంతో పంట పొలాలు మునిగి రైతులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. పొల్లాల్లో పేరుకుపోయిన ఇసుకను తొలగించేందుకు రైతులు వెళ్లడానికి దారి లేక సతమతమవుతున్నారు. మున్సిపల్ అధికారులు, పాలకులు వరదకాలువపై వంతెన నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

క్లుప్తంగా

7న కొండగట్టు ఆలయం మూసివేత

మల్యాల(చొప్పదండి): రాహుగ్రస్త చంద్రగ్రహణాన్ని పురస్కరించుకొని ఈనెల 7న ఆదివారం రాత్రి కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయాన్ని మూసివేయనున్నట్లు ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. ఆరోజు అన్ని ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నామని, మధ్యాహ్నం 12.30గంటలకు స్వామివారికి నివేదన అనంతరం ద్వారబంధనం చేయనున్నట్లు పేర్కొన్నారు. 8న సోమవారం ఉదయం నుంచి యథావిధిగా భక్తులకు సర్వ దర్శనం, ఆర్జిత సేవలు ప్రారంభమవుతాయని తెలిపారు.

వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మంథనిరూరల్: మంథని మండలం ఎగ్లాస్‌పూర్ సమీపంలో గాడుదుల గండి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని మతిస్థిమితం సరిగా లేని, గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాలు.. ఆదివారం మంథని– కాటారం ప్రధాన రహదారిపై జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడనే సమాచారం అందిందని, అతడు మతిస్థిమితం జరిగా లేక గ్రామంలో తిరిగేవాడని గ్రామస్తులు తెలిపారని ఎస్సై వివరించారు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందినట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సదరు వ్యక్తి ఆచూకీ తెలిసినవారు మంథని పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడు..


రాజశేఖర్ (ఫైల్)

ధర్మపురి: ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనంపై నుంచి కిందపడి గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాలు.. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం పొనకల్ గ్రామానికి చెందిన దుమ్మల రాజశేఖర్ (26) జూన్ 16న ధర్మపురి మండలం ఆకసాయిపల్లె గుట్టమలుపు వద్ద ద్విచక్రవాహనంపై వెళ్తూ ప్రమాదవశాత్తు కిందపడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. వైద్యం కోసం కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పిడుగుపాటుకు రైతు దుర్మరణం


మల్లయ్య (ఫైల్)

కమాన్‌పూర్(మంథని): మండలంలోని గుండారం గ్రామానికి చెందిన రైతు గరిగంటి మల్లయ్య ఆదివారం మధ్యాహ్నం పిడుగుపడి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మల్లయ్య గుండారం రిజర్వాయర్ కట్ట కింద తన పొలానికి ఎరువుల మందు చల్లడానికి వెళ్లాడు. పొలంలో మందు చల్లుతుండగా పిడుగుపడి మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

‘ప్రయోగ’ విద్యపై ఆసక్తి

- ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ ప్రయోగాలు
- విద్యార్థుల్లో నైపుణ్యం మెరుగు
- సైన్స్, ఇంజనీరింగ్ వైపు అడుగులు


‘ఈ ఫొటోలోని విద్యార్థులు ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ పాఠశాలకు చెందినవారు. స్కూల్‌లోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో ప్రయోగాలు చేస్తున్నారు. సైన్స్ పాఠ్యాంశంలో భాగంగా ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాన్ని విద్యార్థులు ఇలా ప్రయోగాలు చేసి అవగాహన పెంచుకుంటున్నారు. దీంతో వారిలో పరిశోధన, సృజనాత్మకత పెంపొందుతోంది’.



‘ఇది ఎల్లారెడ్డిపేట హైస్కూల్‌లోని అటల్ టింకరింగ్ ల్యాబ్. ఇలాంటి ల్యాబ్‌లు రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా 26 ప్రభుత్వ హైస్కూళ్లకు కేటాయించారు. ఒక్కో ల్యాబ్‌కు దాదాపు రూ.15లక్షలు వెచ్చించి ఏర్పాటు చేశారు. రానున్న రోజుల్లో ఏటీఎల్ ల్యాబ్‌లు క్రియాశీలకంగా మారనున్నాయి. రానున్న తరాలవారు కొత్తకొత్త ఆలోచనలతో నూతనంగా ఆవిష్కరణలు చేయడానికి కావాల్సిన సైన్స్ పరికరాలు పాఠశాలలకు చేరాయి’.


ఎల్లారెడ్డిపేట హైస్కూల్‌లో సూక్ష్మదర్శినితో పరిశీలిస్తున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో సైన్స్ దృక్పథం పెంచడమే లక్ష్యంగా హైస్కూళ్లలో అటల్ టింకరింగ్ ల్యాబ్స్(ఏటీఎల్స్)ను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థుల్లో గణితం, ఇంజినీరింగ్, సైన్స్ అంశాల్లో మెరుగు పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అటల్ ఇన్నోవేషన్ పథకంలో భాగంగా ఈ ల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. జిల్లాలోని 26 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటు చేసి.. విద్యార్థుల్లో ప్రయోగాలపై ఆసక్తి పెంచుతున్నారు.

ప్రయోగాలే లక్ష్యంగా..

గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయోగాల గురించి పెద్దగా తెలిసేది కాదు. దీంతో విద్యార్థులు సైన్స్‌లో వెనుకబడి ఉండేవారు. దీన్ని అధిగమించేందుకు ప్రభుత్వం ఏటీఎల్స్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు సిద్దిపేటలో శిక్షణ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఐదు పీఎంశ్రీ స్కూళ్ల నుంచి ముగ్గురు చొప్పున మొత్తం 15 మంది ఉపాధ్యాయులకు శిక్షణకు వెళ్లి వచ్చారు. వీరు తమ స్కూళ్లలోని విద్యార్థులతో వివిధ ప్రయోగాలు చేయిస్తున్నారు.

ల్యాబ్ పరికరాలు ఇలా..

అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డులు, త్రీడీ ప్రింటింగ్‌మిషన్, మినీ కుట్టుమిషన్, టెలీస్కోప్, అడినోబోర్డ్స్, మూడు ల్యాప్‌టాప్స్, ఒక ప్రొజెక్టర్‌లను అందుబాటులో ఉంచారు.

పాఠ్యాంశాలపై అవగాహన


అటల్‌టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటయ్యాక విద్యార్థులు సైన్స్ ప్రయోగాలపై ఆసక్తి చూపుతున్నారు. దీని ద్వారా విద్యార్థుల హాజరు శాతం పెరుగుతుంది. సైన్స్ పాఠ్యాంశాలు శ్రద్ధగా వింటున్నారు. అటల్‌టింకరింగ్ ల్యాబ్‌లలో ప్రయోగాలు చేస్తూ పాఠ్యాంశాలపై సమగ్రంగా అవగాహన పొందుతున్నారు. దీంతో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందుతుంది.
– మనోహరాచారి, స్కూల్‌కాంప్లెక్స్ హెచ్‌ఎం, ఎల్లారెడ్డిపేట

భార్య, కూతురును ఇంటి నుంచి గెంటేసిన భర్త

- సీఐఎస్‌ఎఫ్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న భర్త
- పోలీసు ఉన్నతాధికారులు న్యాయం చేయాలని వేడుకుంటున్న బాధితురాలు

చిగురుమామిడి: భర్త ఇంటినుంచి గెంటేయడంతో తనకు న్యాయం చేయాలని వేడుకుంటోంది ఓ బాధితురాలు.. చిగురుమామిడి మండలంలోని చిన్నముల్కనూర్‌కు చెందిన స్రవంతికి ఇదే మండలం సుందరగిరికి చెందిన వ్యక్తితో 2011లో వివాహం జరిగింది. సదరు వ్యక్తి సీఐఎస్‌ఎఫ్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ హైదరాబాద్‌లో ఉంటున్నాడు. కొద్దిరోజులు వీరి కాపురం సజావుగానే సాగింది. వీరికి 12 ఏళ్ల కూతురు ఉంది. కొద్దిరోజులుగా స్రవంతిని భర్త వేధిస్తున్నాడు. ఆమె అత్తగారిల్లయిన సుందరగిరిలో ఉంటోంది. భర్త వేధింపులు భరించలేక చిగురుమామిడి, కరీంనగర్ మహిళా పోలీస్ స్టేషన్‌లలో పలుసార్లు ఫిర్యాదు చేసింది. వారు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అతడి ఆగడాలకు అంతులేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ క్రమంలో సదరు వ్యక్తి ఆదివారం సుందరగిరికి చేరుకుని స్రవంతి, కూతురును ఇంటినుంచి వెళ్లగొట్టాడు. వారి సామగ్రి బయట పడేయడంతో తల్లీకూతురు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు, గ్రామస్తులు ఎవరూ పట్టించుకోవడం లేదని, పోలీసు ఉన్నతాధికారులైనా తనకు న్యాయం చేయాలని బాధితురాలు వేడుకుంటోంది.


భర్త గెంటేయడంతో సామగ్రి వద్ద కూతురుతో స్రవంతి

దొరకని నాగయ్య ఆచూకీ

- ఎగువమానేరు పరీవాహక ప్రాంతంలో అధికారుల గాలింపు
- ఐదు రోజులుగా కుటుంబ సభ్యుల రోదనలు

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు వాగులో ఐదురోజుల క్రితం గల్లంతైన పంపుకాడి నాగయ్య ఆచూకీ ఇంకా లభించలేదు. ఈ నెల 27న నాగయ్య పశువుల మేత నిమిత్తం మానేరు వైపు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఎగువమానేరువాగు ఉప్పొంగింది. దీంతో లోలెవల్ వంతెనపై వస్తున్న నాగయ్య మానేరు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. అతడి ఆచూకీ కోసం అధికారులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు ఐదు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. రెవెన్యూ, నీటి పారుదల, పోలీస్, ఎస్‌డీఆర్‌ఎఫ్ అధికారులతో ఒక్కో టీంలో ఆరుగురిని నియమించి నర్మాల, లింగన్నపేట, మల్లారెడ్డిపేట, వెంకటాపూర్, సిరిసిల్ల, మధ్యమానేరు వరకు గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఐదు రోజులైనా నాగయ్య ఆచూకీ లభించకపోవడంతో అతడి భార్య లక్ష్మి, కుమారుడు సాయికిరణ్, కుమార్తె మానిక రోదనలు ఆగడం లేదు. ఇప్పటికే కేంద్ర మంత్రి బండి సంజయ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ బాధిత కుటుంబానికి మనోధైర్యం కల్పించారు.


నాగయ్య కోసం గాలిస్తున్న బృందం సభ్యులు

అల్ఫోర్స్ కళాశాలలో మహాలింగార్చన

కొత్తపల్లి(కరీంనగర్): విఘ్నేశ్వరస్వామి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొత్తపల్లిలోని అల్ఫోర్స్ బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ఆదివారం మహాలింగార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి –డాక్టర్ వనజారెడ్డి దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. మట్టితో తయారు చేసిన 108 లింగాలకు ప్రాణ ప్రతిష్ఠ చేసి వివిధ ద్రవ్యాలు, పుష్పాలు, పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం నైవేద్యాలు సమర్పించారు. విద్యార్థినులకు రుత్వికులు ఆశీర్వచనం అందజేశారు.


మహాలింగార్చనలో నరేందర్‌రెడ్డి దంపతులు

ఆటోట్రాలీ బోల్తా.. ఇద్దరికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన విద్యార్థి

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): ఆటవిడుపుగా క్రికెట్ మ్యాచ్ ఆడుకొని వస్తున్న విద్యార్థుల ఆటోట్రాలీ బోల్తాపడడంతో 13 మందికి స్వల్ప, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. స్థానిక పోతన కాలనీలోని ఓ గణేశ్ మండపం నిర్వాహకులు ఆదివారం 26 మంది విద్యార్థులకు సింగరేణి స్కూల్ గ్రౌండ్‌లో క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. మ్యాచ్ అనంతరం ఆటోట్రాలీలో పోతనకాలనీకి వస్తున్న క్రమంలో మూలమలుపు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. సుమారు 15 మంది విద్యార్థులకు గాయాలు కాగా, శ్రీనేయన్, ఆద్విత్ తీవ్రంగా గాయపడ్డారు. తల్లిదండ్రులు ఘటన స్థలానికి చేరుకొని చిన్నారులను వివిధ ఆస్పత్రులకు తరలించారు. కాగా, ఒకరిని కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని టూటౌన్ పోలీసులు తెలిపారు.

గర్భిణి హత్య కేసులో నలుగురి అరెస్ట్

ఇల్లందకుంట(హుజూరాబాద్): గర్భిణి హత్య కేసులో నలుగురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం జమ్మికుంటరూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌చార్జి ఏసీపీ శ్రీనివాస్‌జీ వివరాలు వెల్లడించారు. ఇల్లందకుంట మండలం టేకుర్తికి చెందిన ముద్రబోయిన రాములు కథలు చెప్పుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 20 ఏళ్ల క్రితం ఇదే మండలం కనగర్తికి చెందిన రేణుకతో వివాహమైంది. వీరికి ఇద్దరు కొడుకులు అభిషేక్, బన్నీతేజ. ఒకసారి వరంగల్ వెళ్లి వస్తున్న క్రమంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ భర్తతో వేరుగా ఉంటున్న చిగురుమామిడి మండలం బొమ్మనపల్లికి చెందిన తిరుమల(32)తో పరిచయం ఏర్పడింది. 8 ఏళ్ల క్రితం తిరుమలను రాములు రెండో పెళ్లి చేసుకుని టేకుర్తిలో వేరే కాపురం పెట్టాడు. దీంతో మొదటి భార్య, ఆమె కొడుకులు తిరుమలపై కక్ష పెంచుకుని తరచూ గొడవ పడుతుండేవారు. ప్రస్తుతం తిరుమల 7నెలల గర్భిణి. తిరుమల గర్భిణి కావడం ఇష్టంలేని భర్త రాములు, మొదటి భార్య రేణుక, కొడుకులు ఆమెను చంపేయాలని నిర్ణయించుకున్నారు. వీరి చిన్నకుమారుడు బన్నీతేజను హత్యకు ప్రేరేపించారు. ఆన్‌లైన్‌లో కత్తి కొనుగోలు చేశారు. అదును చూసి తిరుమల ఒంటరిగా ఇంట్లో ఉన్న సమయంలో బన్నీతేజ ఆమె గొంతు కోసి, విచక్షణరహితంగా పొడిచి చంపేశాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. నలుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. సమావేశంలో జమ్మికుంట రూరల్, పట్టణ సీఐలు లక్ష్మీనారాయణ, రామకృష్ణ, ఎస్సై క్రాంతికుమార్ పాల్గొన్నారు.


నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు


భారీ వృక్షం తరలింపు

గంగాధర(చొప్పదండి): ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి నర్సరీ నుంచి మహారాష్ట్రలోని పూణే నర్సరీకి తరలిస్తున్న పెద్ద రావిచెట్టు ఆదివారం గంగాధర మండలం మంగపేట సమీపంలో కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిపై రైల్వే ట్రాక్ వద్ద కనిపించింది. రైల్వేగేట్ వద్ద ఉన్న గేట్లను తాకకుండా లారీతో పాటు చెట్టు ఎత్తును పరిశీలించి జాగ్రత్తగా తరలించారు.

గణేశ్ మండపాల్లో చోరీ

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని పలు వినాయక మండపాల్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. కొదురుపాక రోడ్ నంబర్–14 వినాయక మండపంలో రూ.55 వేల విలువ గల ఆంప్లీఫైర్, రోడ్ నంబర్–8 మండపంలో ఒక ఆంప్లీఫైర్, రెండు సౌండ్‌బాక్స్‌లు, హుండీ, రోడ్‌నంబర్–5 గణేశ్ మండపంలో ఆంప్లీఫైర్‌ను దొంగలు ఎత్తుకెళ్లినట్లు నిర్వాహకులు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో అపరిచిత వ్యక్తి

బోయినపల్లి మండలం వరదవెల్లి అనుబంధ రాజన్నపేట గ్రామంలో ఓ వ్యక్తి ఇంట్లో ఆదివారం ఉదయం ఓ అపరిచిత వ్యక్తి ఒపెన్ స్లాబ్‌లో పడుకుని ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. రాత్రి గోడ దూకి ఆ ఇంట్లోకి చొరబడ్డట్లు చెప్పారు. దీంతో అతడిని పోలీసులకు అప్పగించారు. కాగా, అతను కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం శాంతినగర్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు ఎస్సై రమాకాంత్ చెప్పారు. మద్యం మత్తులో వచ్చినట్లు, విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

కోతికి అంత్యక్రియలు


వానరానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

పెద్దపల్లిరూరల్: ప్రమాదవశాత్తు ఓ కోతి మరణించి ఉండడాన్ని గమనించిన స్థానికులు ముందుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించిన ఘటన పెద్దపల్లి మండలం కుర్మపల్లిలో ఆదివారం జరిగింది.. స్థానికుల కథనం ప్రకారం..ఏమైందో ఏమో కానీ ఓ కోతి మరణించి ఉంది.. దానిని గమనించి కోతికి అంతిమసంస్కారం చేయాలని నిశ్చయించుకుని అందుకు ఏర్పాట్లు చేశారు. మరణించిన కోతికి పూలమాల వేసి జైశ్రీరాం అని నినదిస్తూ అంతిమసంస్కారం నిర్వహించారు. ఓ గోతిని తవ్వి అందులో పూడ్చి వేసినట్లు గ్రామస్తులు జడల శ్రీనివాస్, తిరుపతి, ఓదెలు, ప్రశాంత్, అరుణ్‌కుమార్, రమేశ్, రామాంజనేయులు రామస్వామి తదితరులు తెలిపారు.

నెలక్రితం తండ్రి.. ఇప్పుడు కొడుకు..

- బైక్ అదుపుతప్పి దుర్మరణం
- తండ్రి మరణించడంతో నిద్ర కోసం బంధువుల ఇంటికి వెళ్తుండగా ప్రమాదం

ఇల్లంతకుంట(మానకొండూర్): నెల క్రితం తండ్రి చనిపోగా.. నిద్ర కోసం ఆదివారం తన అన్నతో కలిసి బంధువుల ఇంటికి బైకుపై వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. ఇల్లంతకుంట మండలం దాచారం గ్రామానికి చెందిన జక్కుల నవీన్ (30), రామచంద్రం సోదరుల తండ్రి నెల రోజుల క్రితం చనిపోయాడు. ఈక్రమంలో హైదరాబాదులో ఉన్న తన చిన్న తమ్ముడి అత్తగారింటికి నిద్ర కోసమని నవీన్, రామచంద్రం ఆదివారం మధ్యాహ్నం బైక్‌పై బయలుదేరారు. సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి సమీపంలో హైవే రోడ్డుపై ప్రమాదవశాత్తు కిందపడ్డారు. ఈ ప్రమాదంలో నవీన్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందగా, రామచంద్రంకు స్వల్ప గాయాలయ్యాయి. కాగా నవీన్‌కు ఇంతకుముందు ఓసారి వ్యవసాయ బావిలో పడగా గాయాలయ్యాయని, మరోసారి ప్రమాదానికి గురికాగా కాలు విరిగిందని గ్రామస్తులు పేర్కొన్నారు. మతుడికి భార్య శ్రీవాణి, కొడుకు అనన్యన్, కూతురు అనన్య ఉన్నారు. నెల వ్యవధిలో ఒకే ఇంట్లో ఇద్దరు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


నవీన్ (ఫైల్)

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం


విజయ్‌కుమార్ (ఫైల్)

రామగుండం: మతిస్థిమితం సరిగా లేని వ్యక్తి రైలు ప్రమాదంలో మృతిచెందాడు. జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి తిరుపతి తెలిపిన వివరాలు.. స్థానిక అక్బర్‌నగర్‌కు చెందిన మాడిశెట్టి విజయ్‌కుమార్(62) కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేక రైల్వేస్టేషన్ పరిసరాల్లో తిరుగుతుండేవాడు. ఆదివారం రైల్వేస్టేషన్ ప్రాంగణంలోని ప్లాట్‌ఫాం రైలు పట్టాలపై దిగి నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో చెన్నై నుంచి న్యూఢిల్లీ వెళ్తున్న తమిళనాడు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఢీకొని అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. మృతుడికి కొడుకు, ఇద్దరు కూతుర్లున్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తిరుపతి పేర్కొన్నారు.

రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి..

రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం చివరన ఆదివారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి తిరుపతి తెలిపిన వివరాలు.. సుమారు 40 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి రైలు పట్టాలపై నుంచి వెళ్తున్న క్రమంలో గుర్తుతెలియని రైలు ఢీకొనిఅక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు డార్క్ గ్రే కలర్ హాఫ్ టీ షర్ట్, నలుపు లోయర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. అతడి వద్ద ఏలాంటి గుర్తింపు కార్డులు, నగదు, వస్తువులు లభ్యం కాలేదు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి బంధువులు ఎవరైనా ఉంటే 99493 04574, 87126 58604 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బెట్టింగ్ బాబోయ్..

- ఆన్‌లైన్ వేదికగా ఆట
- వచ్చేది గోరంత.. పోయేది కొండంత
- వీధిపాలవుతున్న కుటుంబాలు
- చెప్పుకోలేక ఆత్మహత్యలు

‘చందుర్తి మండలానికి చెందిన యువకుడు హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. స్నేహితులకు ఫోన్ చేసి తనకు అత్యవసరంగా రూ.2 లక్షలు కావాలని, జీతం రాగానే ఇస్తానని తెలిపాడు. కొన్నాళ్లు ఇలాగే తన ఫ్రెండ్స్ వద్ద దాదాపు రూ.50 లక్షలు అప్పు చేశాడు. అప్పు ఇచ్చినవారందరూ ఆరా తీయగా, బెట్టింగ్‌లో పెట్టి నష్టం వచ్చినట్లు తెలుసుకున్నారు. చివరకు అతడి అమ్మానాన్న పొలం అమ్మి అప్పులు చెల్లించారు’.

‘సిరిసిల్ల పట్టణానికి చెందిన వ్యక్తి చిట్‌ఫండ్స్‌లో పని చేసేవాడు. అతడికి రోజువారీ కలెక్షన్‌లో వచ్చిన సొమ్మును కొంచెంకొంచెం ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పెట్టేవాడు. ఆఫీస్‌కు కలెక్షన్ తక్కువ చూపేవాడు. కొద్దిరోజులకు అలా తీసిన సొమ్ము రూ.లక్ష వరకు చేరింది. బెట్టింగ్‌లో డబ్బు పోవడంతో కలెక్షన్ చేసిన సొమ్ము ఆఫీసుకు ఎలా ఇవ్వాలో తెలియక ఆత్మహత్య చేసుకున్నాడు’.



సిరిసిల్లక్రైం: క్షణాల్లో లక్షలు సంపాదించేందుకు పలువురు ఆన్‌లైన్‌లో మార్గాలను వెతుకుతున్నారు. బెట్టింగ్ యాప్‌లలో పెట్టుబడులు పెడుతున్నారు. నిమిషాల వ్యవధిలో పెట్టిన సొమ్ముకు ఎక్కువ రావడంతో ముందుగా రూ.వందలతో ప్రారంభించిన బెట్టింగ్.. రూ.లక్షల్లోకి చేరుకొని తీరా క్షణాల్లోనే నష్టాలను చవిచూసి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రావడం కాదు.. పోవడమే..

ఇదివరకు చాలామంది పేకాట, మట్కా ఆడుతూ లక్షల రూపాయలు పోగొట్టుకోవడమే కాకుండా కటకటాలకు వెళ్లినవారున్నారు. ప్రస్తుతం సులభంగా డబ్బు సంపాదించే ప్రక్రియ రూటు మారింది. కొంతమంది స్టాక్ మార్కెట్లో డబ్బులు వస్తున్నాయన్న ప్రచారంతో దానిలో అనుభవం లేకపోయినా పెట్టుబడి పెట్టి నష్టాలపాలవుతున్నారు. దీనికి సమాంతరంగా ప్రస్తుతం బెట్టింగ్ యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఏదేని సామాజిక మాధ్యమంలో సినిమా, సీరియల్, జోక్స్ వీక్షించే క్రమంలో వచ్చే ప్రకటనలతో ఆకర్షితులై ఆన్లైన్ యాప్‌లను డౌన్లోడ్ చేసుకొని పెట్టుబడులు పెడుతున్నారు. నిమిషాల వ్యవధిలో ఒకట్రెండు దఫాలుగా లాభాలు రావడంతో మరికొంత సంపాదించుకుందామనే క్రమంలో కొండంత నష్టాన్ని చవిచూస్తున్నారు. బెట్టింగ్ వ్యసనంతో పలువురు వ్యాపారులు, ఉద్యోగులు, యువకులు చివరకు చావు మీదకు తెచ్చుకుంటున్నారు.

కృత్రిమ సమస్యలు సృష్టిస్తూ..

బెట్టింగ్ జరిపే సమయంలో ఇంటర్నెట్ సమస్య ఉంటే ఇక అకౌంట్లో జమ చేసిన డబ్బులన్నీ మాయం అయినట్లే. కాగా బెట్టింగ్ యాప్ నిర్వాహకులే ఎదో ఒక రకంగా ఇంటర్‌నెట్‌కు అంతరాయం కలిగించి, వందలాది మంది నుంచి కోట్లాది రూపాయలు దోచుకుంటున్నారు. బెట్టింగ్ చేసే వ్యక్తి ఫోన్ నంబర్‌ను సంబంధిత యాప్ డౌన్లోడ్ చేసే సమయంలో నమోదు చేయడంతో, ఆ నంబర్‌కు యాప్ నిర్వాహకులే బెట్టింగ్ సమయంలో కాల్ చేసి అంతరాయం కలిగిస్తున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం


సులభమార్గంలో డబ్బు వచ్చే విధానాలను నమ్మవద్దు. బెట్టింగ్ యాప్‌లతో జరుగుతున్న ఆర్థిక నష్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నాం. స్టాక్, సైబర్, బెట్టింగ్, రమ్మీ తదితర ఆన్‌లైన్ గేమ్స్‌పై కఠిన నిఘా కొనసాగుతోంది. యువకులు, వ్యాపారులు తమకు ఏమైనా సమస్యలు ఉంటే నిపుణుల సలహాలు తీసుకొని ముందుకెళ్లాలి.
– మహేశ్ బీ గితే, ఎస్పీ, రాజన్న సిరిసిల్ల